


“ఏం వండీ...”

“ఊఁ...”

“మరేమో... మన పక్కింటి సుబ్బలక్ష్మి లేదూ... క్రొత్త షిఫాన్‌చీర కొనుక్కుందండీ, అదెంత, బావుందంటే...”

సుజాత కళ్ళలోకి చూసాడు శ్రీపతి.

బెడ్‌లైట్ అందించేకాంతిలో అమావాస్య లోని తారకల్లా అగుపించాయి సుజాతకళ్ళు.

“నిజమండీ... మీరు చూళ్ళేదుగానీ... అంత అందగత్తె గాకపోయినా సుబ్బలక్ష్మి ఆ చీరెలో ఎంత అందంగావుందో !...” – ఆ‘ఎంత’ అనే పరిమాణాన్ని సుజాత కళ్ళలోంచి, గొంతులోంచి ఈజీగా పసిగట్టేసాడు శ్రీపతి.

“అలాగా...”– శ్రీమతి బుగ్గల్ని సుతారంగా నిమిరాడు.

“మరేనండీ... ఆ చీరెలో ఆ సుబ్బలక్ష్మి అంత అందంగావుంటే...”

వాక్యాన్ని పూర్తిచేయక వదిలేసింది. అలా వదిలేయడంలో తను గొప్ప అందగత్తెననేభావం స్పష్టంగా ధ్వనించింది.

“నువ్వు అప్సరసలావుంటావు– రేపు తప్పక కొనేద్దాం...”

శ్రీపతి ఆరువందలు సంపాదించే గుమాస్తాయేకావచ్చు– ఆ షిఫాన్‌చీరె ఆతని ఆర్థిక స్థితికి ఆవలిగట్టునే వుండవచ్చు– అయినా ఆ టైంలో ప్రక్కనున్న శ్రీమతితో ఆ మాట అనక తప్పిందికాదు. దాని క్కారణం ‘రాత్రి’కావచ్చు, ‘బెడ్ లైట్’ కాంతికావచ్చు, అంత కంటే తన భార్య ‘అందం’కావచ్చు.

భర్తమాటలువిన్న సుజాత, గులాబిరేకుల్లా వున్న తన లేత పెదాలపైనవుంచిన శ్రీపతి మునిపంటిని రెస్పాన్సిచ్చి ‘రిసీవ్’ చేసుకుంది.

సుజాతతో శ్రీపతి పెళ్ళయి నాలుగు నెల్లయింది.

*  *  *

“ఏఁవండీ... ఈ చీరెపైన ఈ నెక్లెస్ బావుందిగదండీ...”

సాయంత్రం శ్రీపతి ఆఫీసునుండి రాగానే వరండాలోకే ఎదురువచ్చి అడిగింది సుజాత.

నెక్లెస్‌చూసిన శ్రీపతికి సుజాత తను స్వయంగా కొనేసిందేమోనని భయంతోకూడిన అనుమానం కలిగింది.

“మీ ఫ్రెండ్‌దా సుజీ... ఆ నెక్లెస్, బావుంది...”

“ఫ్రెండ్ సరోజలేదూ... అది షాపింగ్‌కి వెళ్తా నన్నూ తోడు రమ్మందండీ... తను ఇలాంటిదే తీసుకుంటూ నన్నూ తీసుకొమ్మంది. మా వార్నడిగి వీలైతే తర్వాత తీసుకుంటానని చెప్పానండీ... ‘అన్నయ్యగారికి నేను చెపుతానులే. డబ్బులు ఫస్టుకు ఇవ్వొచ్చు. కొత్త డిజైన్ అందులో స్టాకుకూడా లేవు’ అంటూబలవంతాన

కొనిపించిందండీ, మూడొందలే.... ధర తక్కువయినా బావుంది కదండీ... సరోజ చాలా తెలివైందండీ... తక్కువ ధరలో మంచివి సెలెక్టు చేస్తుంది. ''

భర్త కళ్ళలోకి చూసింది సుజాత.

రెప్పపడని ఆ కళ్ళలో అసహనం వుందో, అసమర్థత వుందో తెలియదుగాని సుజాతకు మాత్రం కొద్దిగా కోపం కనిపించింది.

''మీకిష్టం లేకపోతే చెప్పండీ... వాపసు ఇచ్చేద్దాం. దుకాణం వాడికి ముందే చెప్పాను. ఇలాంటివి మావారికి నచ్చవు, ఒకవేళ తిరిగి ఇచ్చేస్తే తీసుకోవాలీ అనీ...''

శ్రీపతి మాట్లాడేందుకు గొంతురాలేదు.

చేతిలోని ఫైళ్ళ కట్టతో లోనికి భారంగా అడుగులు వేసాడు.

* * *

''ఇంత ఖరీదైన కాస్మొటిక్సూ, మేకప్ సామాను ఇప్పుడే మవసరం సుజీ...''

అదే నెలలో ఇంట్లో హఠాత్తుగా కనిపించిన ఖరీదైన మిర్రరూ, మేకప్‌సెట్టూ చూసి అడిగాడు శ్రీపతి ఆరోజు.

బుంగమూతి పెట్టడమేకాదు బుజ్జిపాపాయిలాగే అంది సుజాత — 'ఒక్కొక్కటీ సమకూర్చుకోకపోతే ఎలాగండీ' అని.

''అలాగని ఒకేసారి కొనెయ్యడమేనా .. గ్రాడ్యుయేటువయినా ఇంకా జ్ఞానం వచ్చిచావలేదు. . ఛ.. ఛ .''

''నా మొగానికి ఈ మేకపు సామానొద్దు.. ఈ చీరెలూ, నెక్లెసూ వద్దు, కొట్టువాడికి తిరిగి పంపించెయ్యండి... ఆకలైతే ఇంత తిని దరిద్రపు దేవతలా ఓ మూల పడివుంటాను. .''

ఉరుములా ఉరిమింది... ఆపైన వానలా కన్నీరు కార్చింది సుజాత.

శ్రీపతి తగ్గాడు... తప్పిందికాదు.

''అదికాదు సుజాతా.. ఈ నెలలోనే చీరె కొన్నావు, నెక్లెను కొన్నావు, ఆపైన ఈ సామాను... నీకు తెలును... నా జీతం ఆరొందలని, దాంతోనే నెలంతా గడిచేదని. కావాలనుకుంటే వచ్చే నెలలో కొనుక్కునేవాళ్ళం...''

సుజాత విసురుగా లోనికెళ్ళింది.

ఆ రోజు రాత్రి శ్రీపతి బుజ్జగించి తన వేపు త్రిప్పుకొనేవరకూ కోపాన్నే అభినయించింది ఆవిడ.

* * *

నెల చివర్లో ... ఆబిడ్స్‌లోని షాపులో ...

''ఏవండీ ... ఈ ప్యాంటు పీసు మీకు చాలా బావుంటుందండీ...''

''వద్దులే సుజాతా ... తర్వాత కొనుక్కుందాం ... ''

''మీకున్నవే రెండు ... తీసుకోండి. మా సరోజ రిలేటివ్సే ఈ షాపు యజమాని, తర్వాత డబ్బు కట్టొచ్చు. కదూ సరోజా ...''

## ''సుజాత ది గ్రేట్ !

ప్రక్కనున్న సరోజ వేపు తిరిగింది సుజాత. సుజాత భర్తతో షాపింగ్‌కు వస్తూ సరోజనూ వెంట తీసుకవచ్చింది. సరోజ సెలెక్షన్ బావుంటుందని సుజాత నమ్మిక.

''అవునండీ ... వెరైటీగా వుంది ... తీసుకోండి'' సరోజ రెట్టించింది.

శ్రీపతిలో అభిమానం మేల్కొంది. అవుననక తప్పలేదు. సరోజను వెంట తీసుకవచ్చినందుకు మనస్సులో సుజాతను తిట్టకా తప్పింది కాదు.

''సుజాతా ... ఈ బ్లాక్ పీసు చూసావూ ... ఫుల్ పాలిష్డ్ ! నిన్ననే వచ్చాయట. నీ బాడీ కలర్‌కు చక్కగా సూటవుతుంది—తీసుకో. నేనూ ఒకటి తీసుకుంటున్నాను ... ''

సరోజ మాటలకు సుజాత భర్త మొగంలోకి చూసింది. సరోజపై లోలోన నిప్పులు కక్కుతున్నా మొగంపైన మాత్రం చిరునవ్వును పులుముకున్నాడు, సుజాతపై ప్రేమ వొలకబోసాడు.

''తీసుకో సుజీ...''

శ్రీపతి మాటలకు సుజాత మొగంలోకి దీపావళి వచ్చి నిల్చింది. డోర్ కర్టన్సంటూ, విండో కర్టన్సంటూ ఆరోజు బిల్లును అయిదొందలకు పెంచింది సుజాత.

షాపునుండి అసహనంగా కదిలాడు శ్రీపతి.

ఇంట్లోకి అడుగు పెట్టిగాని మూడోకన్ను తెరవలేదు.

సుజాత కళ్ళు సముద్రాలయ్యాయి.

## ఇంటి పెత్తనం స్త్రీలదే!

జపాను స్త్రీలు సున్నిత మనస్కులనీ మంచీ మర్యాద తెలిసినవారని విదేశీయుల అభిప్రాయం. ఆ సంగతి ఎట్లా ఉన్నప్పటికినీ, ఇంటి పెత్తనం మాత్రం గృహిణులదే. ఇంట్లోకి ఏమేమి కొనాలీ, చదువులకెంత ఖర్చుపెట్టాలీ, ఎంత పొదుపు చేయాలీ మొదలైన విషయాలలో స్త్రీలదే తుది నిర్ణయం, జపానులో ఉద్యోగంచేసే మహిళల సంఖ్య పెరుగుతున్నది. దాంతో స్త్రీల గౌరవ మర్యాదలు కూడ పెరుగుతున్నాయి. అనేక వ్యాపార సంస్థలలో స్త్రీలను నియమించటం ఆర్థికంగా లాభకరంగా ఉంటున్నది. విద్యారంగంలోకూడా స్త్రీలు చురుగ్గా పాల్గొంటున్నారు. ఏటొచ్చీ, రాజకీయాలలో స్త్రీలు పాల్గొనే అవకాశం కన్పించటం లేదు !

ఆ రోజు ఎవ్వరూ ఎంగిలిపడలేదు — రాత్రి పదకొండు దాటింది.

కోపంతోనే నిద్రలోకి జారుకుంది సుజాత ఆమె మొగంలోకి చూసాడు శ్రీపతి. నిర్మలంగా వుంది, అమాయకంగా వుంది. అంతకంటే సున్నితంగా వుంది. ''ఇంత సుకుమారమైన మనస్తత్వం పైనేనా తను చేయి చేసుకుంది'' తనను తనే నిందించుకున్నాడు శ్రీపతి.

''తమ ఇద్దరి మధ్యా కలహానికి కారణం చాలీచాలని తన జీతం! దాంతో సుజాత తను సుఖపెట్టలేక పోతున్నాడు. అందుకే ...'' ఓ నిర్ణయానికొచ్చాడు శ్రీపతి— అప్పటికిగాని అతని మనస్సు తేలికపడలేదు.

* * *

తెల్లవారింది.

''సుజీ... నీకు గుడ్ న్యూస్ ...''

ఏమిటన్నట్లు చూసింది సుజాత.

''నెల్లక్రితం నీకొచ్చిన ఉద్యోగానికి జాయినింగ్ డేటు ఇంకా వుందా ...''

''గడువయి పోయింది గాని రెక్వెస్టు చేస్తే జాయిన్ చేసుకోవచ్చునేమో.. అవునూ ఇప్పుడెందుకండీ ఆ వుద్యోగం గురించి, అప్పుడు జాయినవ్వడం వద్దన్నారు గదా . ''

''రేపు వెంటనే వెళ్ళి జాయినింగ్ రిపోర్టిచ్చెయ్ .. ''

''నిజంగా ! .''

ఆశ్చర్యం, ఆనందం — ఈ రెండూ కల్సిపాయి సుజాత గొంతులో. ''అవును సుజీ ... నా ఒక్కడి జీతంతో మనం హాయిగా ఉండలేకపోతున్నాం. నీ కోరికలూ, నీ అభిరుచులూ నీకున్నాయి ఆర్థిక ఇబ్బందుల మూలంగా మన మధ్య కలహాలు రాకూడదు.''

''మెనీ మెనీ థ్యాంక్సండీ.. '' కాఫీ కప్పును ప్రక్కనబెట్టి తన బుగ్గపై ఒక ముద్దిచ్చి సిగ్గుతో లోనికి పరుగెత్తే 'సుజీ'ని చూసి హాయిగా ఊపిరి పీల్చాడు శ్రీపతి.

* * *

''హలో సరోజా.. గుడ్ న్యూస్ ! మావారు నా ఉద్యోగానికి గ్రీన్‌సిగ్నలిచ్చారు...'' ఆ సాయంకాలం సరోజ ఇంటికెళ్ళింది సుజాత.

''రియల్లీ ! కంగ్రాచ్యులేషన్స్ ... అయితే మన ప్లాను సక్సెసన్నమాట.''

''కాని... నాకు మాత్రం బాధగా వుందే.. మా వారిని మోసం చేసానేమోనని ...''

''ఇందులో మోసం ఏముందే... మీ వారి మనస్సు మార్చడం కొరకు చూపినవన్నీ కొంటానన్నావ్ .. గెల్చావు... ఏది చేసినా మీ ఇద్దరి సంతోషానికే గదా. . మొత్తానికి సాధించావు...''

''పోవే... నాటకంలో అసలు పాత్రధారి నువ్వేకదా...''

కలిసినవ్విన వీరి నవ్వుల్లోంచి పన్నీజాజులు కురిసాయి. ★